జీఎన్ఐటీఎస్‌లో రక్తదాన శిబిరం



గోల్కొండ: రక్తదాతలు కనిపించే దేవుళ్లు అని షేక్‌పేట్‌లోని జీ.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ జి.రాఘవరెడ్డి అన్నారు. సోమవారం కళాశాలలో ఎన్ఎస్ఎస్, జేవైసీ, మెడికల్ సెల్, రౌండ్ టెబుల్ వారి సౌజన్యంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కళాశాల అధ్యాపకులు రక్తదానానికి ముందుకు వచ్చి రక్తదానం చేశారన్నారు. దీనికి తోడు వివిధ విభాగాలకు చెందిన ఇంజినీరింగ్ విద్యార్థినులు స్వచ్ఛందంగా రక్తదానం చేసి తమలోని సేవా గుణాన్ని చాటుకున్నారని ఆయన అన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ కె.రమేష్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఎన్‌వీఎస్ఎల్ నరసింహం, మెడికల్ సెల్ కోఆర్డినేటర్ పి.వి.రాం మోహన్‌రెడ్డి, జేవైసీ కోఆర్డినేటర్ కె.భారత లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి రోడ్ షోకు విశేష ఆదరణ



రోడ్ షోలో మాట్లాడుతున్న రేవంత్ రెడ్డి. చిత్రంలో మహ్మద్ ఫిరోజ్ ఖాన్

నాంపల్లి: నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మహ్మద్ ఫిరోజ్ ఖాన్‌కు మద్దతుగా ప్రచారం చేయడానికి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేపట్టిన రోడ్‌షోకు విశేష ఆదరణ లభించింది. రేవంత్‌రెడ్డికి దారిపొడవునా ప్రజలు నీరాజనాలు పట్టారు. రేవంత్‌రెడ్డి కాన్వాయ్‌పై పూలను చల్లి తన అభిమానాన్ని చాటుకున్నారు. నియోజకవర్గంలో మొదటగా గుడిమల్కాపూర్ డివిజన్‌లోని కింగ్ ప్యాలెస్ వద్ద సోమవారం ప్రారంభమైంది. భోజగుట్ట, జేబాభాగ్ విక్టోరియా హోటల్, మల్లేపల్లి ఎక్స్‌రోడ్డు, రియాన్ హోటల్ వద్ద ముగిసింది. రేవంత్‌రెడ్డి నాంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి మహ్మద్ ఫిరోజ్ ఖాన్, స్థానిక నేతలు రషీద్ ఖాన్, ఉస్మాన్ మహ్మద్ ఖాన్‌లతో కలిసి అభివాదం చేశారు. ఈ సందర్భంగా మల్లేపల్లి ఎక్స్ రోడ్డు, నూర్ హోటల్ వద్ద ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లలో మాట్లాడుతూ..ప్రభుత్వ తీరును రేవంత్‌రెడ్డి ఎండగట్టారు. నియోజకవర్గంలోని రెడ్‌హిల్స్, మల్లేపల్లి, మురాద్‌నగర్, ఆసిఫ్‌నగర్, మెహిదీపట్నం, మల్లేపల్లి, విజయనగర్ కాలనీ, అహ్మద్ నగర్ డివిజన్లకు చెందిన కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలివచ్చారు. ఫిరోజ్ ఖాన్ మాట్లాడుతూ.. డిసెంబర్ 9న రేవంత్‌రెడ్డి సీఎంగా ప్రమాణ స్వీకారం చేస్తారన్నారు. రేవంత్‌రెడ్డి క్యాబినెట్‌లో తాను ఉండబోతున్నానని ధీమా వ్యక్తం చేశారు.

కార్వాన్‌లో బీఆర్ఎస్ ప్రచారం



ప్రచారంలో కార్వాన్ బీఆర్ఎస్ అభ్యర్థి మిత్ర కృష్ణ

గోల్కొండ: తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలు మరే రాష్ట్రంలో లేవని బీఆర్ఎస్ కార్వాన్ నియోజకవర్గ అభ్యర్థి మిత్ర కృష్ణ అన్నారు. సోమవారం ఆయన కార్వాన్ నియోజకవర్గంలోని పలు డివిజన్‌లలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ తిరుగుతూ ఓటర్లను కలుసుకొని తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. తెలంగాణలో సీఎం కేసీఆర్ పాలన దక్షత కారణంగా వేలాది పేద కుటుంబాలకు సంక్షేమ పథకాల వల్ల లబ్ధి చేకూరుతుందని అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం ఎంతగానో అభివృద్ధి చెందిందని ఆయన పేర్కొన్నారు.

భారతీయ కళలను పరిరక్షించుకోవాలి



మహతి ఆర్ట్స్ నిర్వాహకులను సత్కరిస్తున్న అతిథులు

నాంపల్లి: దేశ సంస్కృతి, సంప్రదాయాలు, కళలను పరిరక్షించుకోవాలని విశ్రాంత జిల్లా న్యాయమూర్తి నేరెళ్ల మాల్యాద్రి అన్నారు. మహతి ఆర్ట్స్ 20వ వార్షికోత్సవ వేడుకలు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, నందమూరి తారక రామారావు కళా మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహతి ఆర్ట్స్ విద్యార్థులు ప్రదర్శించిన సంగీత కచేరిని ఆలకించి, అనంతరం కళాకారులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో బుల్లి తెర నటులు డాక్టర్ సుదర్శన్, కర్ణాటక సంగీత విద్వాంసురాలు హరిప్రియ, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఎం.సి.సభ్యులు పి.జ్యోతి, ఎస్9 టీవీ సీఈఓ ఎం.రవికుమార్, మహతి ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.కె.వెంకటాచారి, కార్యదర్శి కృష్ణకుమార్ పాల్గొన్నారు.

రాజాసింగ్‌కు పరాభవం తప్పదు



ఇంటింటా ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి నందకిశోర్ వ్యాస్ బిలాల్

అబిడ్స్: పదేళ్లుగా ప్రజలను పలు విధాలుగా వేధిస్తున్న బీజేపీ అభ్యర్థి ఎమ్మెల్యే రాజాసింగ్‌కు పరాభవం తప్పదని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి నందకిశోర్ వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. సోమవారం బేగంబజార్, ఫీల్‌ఖానా, మిట్టికా షేర్, బర్తన్‌బజార్‌లతో పాటు పలు వ్యాపార కేంద్రాల్లో పర్యటించి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నందకిశోర్ వ్యాస్ బిలాల్ మాట్లాడుతూ.. ఏ ప్రాంతానికి వెళ్లినా వ్యాపారులందరూ, స్థానిక ప్రజలందరూ ఎమ్మెల్యే రాజాసింగ్ తమను వేధిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్లు వెల్లడించారు. రాజాసింగ్ వేధింపులతో, రాజాసింగ్ అవినీతితో తీవ్ర ఆవేదనతో ఉన్న ప్రజలంతా ఈనెల 30వ తేదీ కోసం రాజాసింగ్‌ను ఓడించేందుకు ఎదురు చూస్తున్నారన్నారు. ప్రదీప్ రాజ్, రాజుయాదవ్, పప్పుమాత్రే, ఉమాదేవి వ్యాస్, ప్రియాగుప్తా, సంతోషి, అరుణ పాల్గొన్నారు.

గోషామహల్‌లో బీఆర్ఎస్ విజయం ఖాయం



మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రావు, ముఖేష్ సింగ్

అబిడ్స్: సీఎం కేసీఆర్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి, ప్రగతితోనే గోషామహల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ విజయం సాధిస్తుందని గోషామహల్ బీఆర్ఎస్ ఎన్నికల ఇన్‌చార్జి, తెలంగాణ రాష్ట్ర టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ పి.జగన్‌మోహన్‌రావు పేర్కొన్నారు. ధూల్‌పేట్‌లో గోషామహల్ మాజీ కార్పొరేటర్ ముఖేష్ సింగ్ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యకర్తలు, బూత్‌స్థాయి కమిటీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ జగన్‌మోహన్ రావు మీడియాతో మాట్లాడుతూ..గోషామహల్ నియోజకవర్గంలోని 235 బూత్‌లలో తమ బూత్‌స్థాయి కో ఆర్డినేషన్ కమిటీ ఇంటింటా తిరుగుతూ ఓటర్లకు బీఆర్ఎస్ ప్రభుత్వ పథకాలను వివరిస్తారన్నారు. ప్రతిరోజూ తమ పార్టీ కార్యకర్తలు, నాయకులు పర్యటించి బీఆర్ఎస్ అభ్యర్థి నందకిశోర్ వ్యాస్ బిలాల్‌ను గెలిపించేందుకు కృషి చేస్తారన్నారు. ముఖేష్ సింగ్ మాట్లాడుతూ..లోధ్ కులస్తులతో పాటు అన్నివర్గాల ప్రజలు బీఆర్ఎస్‌ను ఆదరిస్తున్నారని ఆయన అన్నారు.

అంకిత భావంతో పని చేయాలి



విద్యార్థులతో డాక్టర్ మజహర్‌ఉల్లా తదితరులు

గోల్కొండ: అంకిత భావంతో పని చేస్తే విజయం వరిస్తుందని గోల్కొండ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మజహర్‌ఉల్లా అన్నారు. గోల్కొండ బాలుర ప్రభుత్వ మైనార్టీ రెసిడెన్షియల్ ఒకేషనల్ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు ఏరియా ఆస్పత్రిలో టెక్నికల్ ల్యాబ్‌లో మెళకువలు నేర్చుకుంటున్నారు. సోమవారం ఆయన వారితో మాట్లాడి వృత్తి నైపుణ్యాలను వివరించారు. ల్యాబ్ సిబ్బంది ఇచ్చే రిపోర్టులపైనే వైద్యులు రోగులకు సరైన సలహాలు, సూచనలతో పాటు మందులు కూడా ఇస్తారని అన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి ఏఓ, ఇన్‌చార్జి ఆర్ఎంఓ డాక్టర్ శ్రీనివాస్‌రావు, ల్యాబ్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్లను సందర్శించిన డీసీపీ



దుర్గానగర్ పాఠశాల పోలింగ్ స్టేషన్‌ను సందర్శించిన డీసీపీ బాలస్వామి

జియాగూడ: కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ పరిధిలోని పోలింగ్ స్టేషన్లను సందర్శించడం జరిగిందని డీసీపీ బాలస్వామి అన్నారు. సోమవారం కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ పరిధిలో 63 పోలింగ్‌స్టేషన్లు ఉండగా అందులో సమస్యాత్మకమైనవి, ఇతర ఇబ్బందులు ఉన్న పోలింగ్ స్టేషన్లను డీసీపీ బాలస్వామి, ఏసీపీ మహ్మద్ జావేద్‌తో కలిసి సందర్శించారు. ఆయన మాట్లాడుతూ..పోలింగ్ స్టేషన్ పరిసరాల్లో ఎలాంటి ఇబ్బందులు ఉండకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్, ఎస్ఐ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

‘బీఆర్ఎస్‌కు, ఎంఐఎంకు మధ్యనే పోటీ’



కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న సీహెచ్. ఆనంద్‌కుమార్ గౌడ్

నాంపల్లి: మల్లేపల్లి డివిజన్‌లో నాంపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి సీహెచ్. ఆనంద్‌కుమార్ గౌడ్ పర్యటించారు. అఫ్జల్‌సాగర్‌లో ఓ అవ్వకు కర పత్రాన్ని అందజేసి కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఆగాపుర, బోయిగూడ కమాన్, జాకీర్ హుస్సేన్ కమ్యూనిటీ హాలు ప్రాంతాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ... బీఆర్ఎస్‌కు, ఎంఐఎంకు మధ్యనే పోటీ ఉంటుందని, ప్రభుత్వ పథకాలు ప్రతి ఇంటికి అందుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెట్టు వాల్మీకి, ప్రదీప్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ విజయానికి ముదిరాజ్‌లు కృషి



ముదిరాజ్‌లతో ప్రచారానికి వెళ్లిన కాసాని జ్ఞానేశ్వర్, బండారి వెంకటేష్

అబిడ్స్: ముదిరాజ్‌లంతా ఐక్యంగా ఉండి బీఆర్ఎస్ గెలుపునకు కృషి చేస్తున్నట్లు తెలంగాణ ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు, 93 బీసీ కులాల ఐక్యవేదిక అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్, రాష్ట్ర బీఆర్ఎస్ నాయకుడు బండారి వెంకటేష్ పేర్కొన్నారు. పలు జిల్లాల్లో బీఆర్ఎస్‌ను గెలిపించేందుకు నగరం నుంచి తరలివెళ్లారు. సోమవారం బండారి వెంకటేష్ ఆధ్వర్యంలో గోషామహల్, కార్వాన్, నాంపల్లి నియోజకవర్గాల నుంచి పెద్ద ఎత్తున ముదిరాజ్‌లు కలిసి వికారాబాద్ జిల్లాకు తరలివెళ్లారు. వారు మాట్లాడుతూ..బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని మరోసారి అధికారంలోకి తెచ్చేందుకు పెద్ద ఎత్తున కృషి చేస్తామన్నారు. ప్రకాష్ ముదిరాజ్, మారయ్యయాదవ్, జోగేందర్ సింగ్, శ్రీనివాస్ ముదిరాజ్, మేకల భిక్షపతి పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీజే రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్

చార్మినార్: ముస్లిం ప్రజలు తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని మూవ్‌మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ (ఎంపీజే) రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ అన్నారు. సోమవారం ఎంపీజే ఆధ్వర్యంలో ఓటు విలువ-ప్రాధాన్యత అనే అంశంపై జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సాధారణంగా ఎప్పుడు ఎన్నికలు వచ్చినా ముస్లింలు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి అశ్రద్ధ వహిస్తారన్నారు. ముస్లింలలో లోపించిన రాజకీయ చైతన్యంపై తాము సభలు, సమావేశాలు సైతం నిర్వహించి అవగాహన కల్పిస్తున్నామన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు అబ్దుల్ నయిం, ప్రధాన కార్యదర్శి సలీం అల్ హింద్, ఫైనాన్స్ సెక్రటరీ అహ్మద్ హమీదుద్దీన్ షకీల్ పాల్గొన్నారు.

కార్వాన్‌లో బీఆర్ఎస్ గెలుపు ఖాయం



కపోతాలను ఎగరవేస్తూ ఓటు వేయాల్సిందిగా అభ్యర్థిస్తున్న మిత్ర కృష్ణ

జియాగూడ: కార్వాన్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ అఖండ విజయం సాధిస్తుందని ఆ పార్టీ అభ్యర్థి మిత్ర కృష్ణ అన్నారు. సోమవారం నియోజకవర్గంలోని పలు డివిజన్లలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద శాంతి కపోతాలను ఎగరవేశారు. అనంతరం మాట్లాడుతూ..కేసీఆర్ సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి అందాయని, దీంతో ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి బీఆర్ఎస్‌కు ఓటు వేస్తారన్నారు. అరుణ్‌కుమార్, శ్రీనివాస్‌గుప్తా, కిశోర్‌కుమార్, నరహరి చారి, దేవేందర్ సాగర్, ఉమేష్, అభిషేక్, విజయ్ ముదిరాజ్ పాల్గొన్నారు.

కార్వాన్ నుంచి మరోసారి అవకాశం ఇవ్వండి



మాట్లాడుతున్న మజ్లిస్ అభ్యర్థి కౌసర్ మొహియుద్దీన్

గోల్కొండ: కార్వాన్ నుంచి మరోసారి అవకాశం ఇవ్వాలని కార్వాన్ మజ్లిస్ సిట్టింగ్ ఎమ్మెల్యే, అభ్యర్థి కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. సోమవారం ఆయన గోల్కొండలో జరిగిన ఎన్నికల సభలో మాట్లాడారు. కార్వాన్ నియోజకవర్గంలో ఇతర పార్టీల అభ్యర్థులు కూడా పోటీలో ఉన్నారని అయితే వారంతా ప్రజలకు అందుబాటులో ఉండని పార్టీల అభ్యర్థులే అని అన్నారు. కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే ప్రజల ముందుకు వచ్చే అభ్యర్థులకు ఓటు వేయొద్దని ఆయన కోరారు. పదేళ్లల్లో ఎమ్మెల్యేగా తాను వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి చేయించానని కార్వాన్ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి పనులే ఇందుకు నిదర్శనమన్నారు. నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, నాయకులు హారూన్‌ఫరాన్, బదరుద్దీన్, పాషాభాయ్, షకీల్‌ఆలీఖాన్, హబీబ్ చాయూష్ తదితరులున్నారు.

బీఆర్ఎస్ పథకాలు దేశానికే ఆదర్శం



మాట్లాడుతున్న దామోదర్‌గుప్తా, పరమేశ్వరీ సింగ్

అబిడ్స్: బీఆర్ఎస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, బీఆర్ఎస్ ఎన్నికల ఇన్‌చార్జి కోలేటీ దామోదర్‌గుప్తా పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశంలోని పలు రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుని వారు కూడా అమలు చేశారన్నారు. సోమవారం మంగళ్‌హాట్ డివిజన్ కార్యకర్తలు, నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కార్యకర్తల కృషి, పట్టుదలతోనే గోషామహల్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి నందకిశోర్ వ్యాస్ బిలాల్ విజయం సాధిస్తారన్నారు. మాజీ కార్పొరేటర్ పరమేశ్వరీ సింగ్ మాట్లాడుతూ..పదేళ్లుగా మంగళ్‌హాట్‌లో బీజేపీ ఎమ్మెల్యే ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. ఆనంద్ సింగ్, శ్రీశైలం, శ్రీనివాస్‌యాదవ్, మనోహర్ గైక్వాడ్, శశిరాజ్ సింగ్ పాల్గొన్నారు.

విఠలాచార్యకు పురస్కార ప్రదానం

గన్‌ఫౌండ్రీ: ప్రాజ్ఞిక ఫౌండేషన్, సీల్‌వెల్ కార్పొరేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ సాహిత్యవేత్త డాక్టర్ కె.విఠలాచార్యకు సీల్‌వెల్ బహుముఖ ప్రజ్ఞాశాలి పురస్కారాన్ని సోమవారం రవీంద్రభారతిలో ప్రదానం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ సారస్వత పరిషత్ అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి మాట్లాడుతూ..సాహితీ శిఖరానికి సముచిత గౌరవం లభించిందన్నారు. అనాథ విద్యార్థి గృహ అధ్యక్షుడు ఎం.రాజేష్, సరస్వతి ఉపాసకులు దైవాజ్ఞశర్మ, ప్రాజ్ఞిక వ్యవస్థాపకులు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

రెయిన్‌బజార్‌లో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్

డబీర్‌పురా: రెయిన్‌బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆదివారం రాత్రి పోలీసులు, ఆర్మ్‌డ్ ఫోర్స్ బలగాలు ఫ్లాగ్‌మార్చ్‌ను నిర్వహించారు. దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య మాట్లాడుతూ..ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ పోలీసులకు పూర్తిగా సహకరించాలన్నారు. ప్రజలకు భరోసా కల్పించేందుకు తాము ఈ ఫ్లాగ్‌మార్చ్‌ను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో దక్షిణ మండలం అడిషనల్ డీసీపీ షేక్ జహంగీర్, మీర్‌చౌక్ డివిజన్ ఏసీపీ ఎస్ఎస్‌వీ వెంకటేశ్వర్‌రావు, రెయిన్‌బజార్ ఇన్‌స్పెక్టర్, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

గోషామహల్‌లో కాంగ్రెస్‌కు విశేష స్పందన



హనుమాన్ టేక్డీలో ప్రచారం చేస్తున్న సునీతారావు

సుల్తాన్‌బజార్: గోషామహల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి విశేష స్పందన లభిస్తుందని ఆ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి మొగిలి సునీతారావు అన్నారు. హనుమాన్‌టేక్డీ, కందస్వామిలేన్, గుజరాతీగల్లీ, గాడిఖానా తదితర ప్రాంతాల్లో ఆమె ప్రచారం నిర్వహించి ప్రజలను కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని అభ్యర్థించారు. గోషామహల్‌లో కాంగ్రెస్ జెండాను ఎగరవేసి సోనియాగాంధీకి బహుమతిగా ఇస్తానని ఆమె ధీమా వ్యక్తం చేశారు.

బహదూర్‌పురాలో కాంగ్రెస్ అభ్యర్థి పాదయాత్ర



ప్రచారం చేస్తున్న పులిపాటి రాజేష్ కుమార్

దూద్‌బౌలి: తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీ పథకాలు అమలు చేస్తామని బహదూర్‌పురా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పులిపాటి రాజేష్‌కుమార్ హామీ ఇచ్చారు. సోమవారం ఆయన గ్రేటర్ ఓబీసీ సెల్ ఉపాధ్యక్షుడు కాశమోనీ శ్యాంరావు ముదిరాజ్‌తో పాటు పార్టీ అభిమానులు, కార్యకర్తలతో కలిసి పలు బస్తీల్లో పాదయాత్ర నిర్వహించారు. చందు, సంతోష్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కార్తీకమాస పూజలు



గుడిమల్కాపూర్ సాయిబాబా ఆలయంలో..

అబిడ్స్: కార్తీకమాసం దీపాలంకరణ గుడిమల్కాపూర్ సాయిబాబా త్రయంబకేశ్వర ఆలయంలో ఘనంగా నిర్వహించారు. భక్తులు సోమవారం సాయంత్రం పెద్ద ఎత్తున దీపాలు వెలిగించి పూజలు చేశారు.

కోమటివాడిలో..

డబీర్‌పురా: కోమటివాడిలోని రామాలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకొని సోమవారం ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. బొంగులూరి రాంమూర్తి శాస్త్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పూజా కార్యక్రమంలో స్థానిక ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తాం



ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి బోయ నగేష్

చాంద్రాయణగుట్ట: కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని చాంద్రాయణగుట్ట నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి బోయ నగేష్ అన్నారు. ఉప్పుగూడలో సోమవారం ఆయన ఇంటింటికి తిరుగుతూ హస్తం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఆయన మాట్లాడుతూ..చాంద్రాయణగుట్ట నియోజకవర్గాన్ని ఏళ్ల తరబడిగా పాలిస్తున్న ఎంఐఎం పార్టీ ఏ మాత్రం అభివృద్ధి చేయలేకపోయిందన్నారు. తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తానన్నారు.

బీఆర్ఎస్ పతనం ఖాయం



ప్రచారంలో కార్వాన్ బీజేపీ అభ్యర్థి అమర్‌సింగ్

గోల్కొండ: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పతనం ఖాయమని కార్వాన్ బీజేపీ అభ్యర్థి టి.అమర్ సింగ్ అన్నారు. సోమవారం ఆయన కార్వాన్ డివిజన్‌లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దశాబ్దాల పాలనలో కాంగ్రెస్ తెలంగాణను మోసగించిందని ఆరోపించారు. అదే విధంగా పదేళ్ల తన పాలనలో సీఎం కేసీఆర్ తెలంగాణను పథకాల పేరుతో వేల కోట్ల రూపాయలు దోచుకున్నారని విమర్శించారు. తెలంగాణ బాగుపడాలంటే బీజేపీని గెలిపించాలని ఆయన కోరారు.

26న ఆర్యవైశ్య సంఘం వన భోజనాలు

జియాగూడ: ఈనెల 26న ఆర్యవైశ్య సంఘం పురానాపూల్ ఆధ్వర్యంలో కార్తీకమాస వనభోజనాలు పెంజర్ల అనంతపద్మనాభ స్వామి ఆలయ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు ప్రాజెక్ట్ కన్వీనర్ మాడిశెట్టి సదానందం గుప్తా, ప్రాజెక్ట్ చైర్మన్ యాద శ్రీనివాస్ గుప్తా తెలిపారు. 26న ఆదివారం నిర్వహించే వన భోజనాల కార్యక్రమానికి కార్వాన్ బీఆర్ఎస్ అభ్యర్థి మిత్ర కృష్ణ, ఆలయ చైర్మన్ అనితారెడ్డి, గజవాడ నర్సిములు, సరాపు రమేష్, వంగపల్లి రాజన్న పాల్గొంటున్నట్లు తెలిపారు.


బీజేపీతోనే గోషామహల్ అభివృద్ధి



ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే రాజాసింగ్

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గం అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమవుతుందని గోషామహల్ బీజేపీ అభ్యర్థి ఎమ్మెల్యే రాజాసింగ్ పేర్కొన్నారు. ధూల్‌పేట్ పరిసర ప్రాంతాల్లో ఆయన విస్తృత ప్రచారం చేశారు. అనంతరం మాట్లాడుతూ..పదేళ్లుగా గోషామహల్ నియోజకవర్గం నలుమూలలా కోట్లాది రూపాయాల అభివృద్ధి పనులు చేపట్టానన్నారు. మరోసారి విజయం సాధించి హ్యాట్రిక్ పొందుతానన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్‌ల అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మరని ఆయన అన్నారు. బీజేపీ నాయకులు రవీందర్ సింగ్, ఎం.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

‘మా అభ్యర్థులు భారీ మెజార్టీతో విజయం సాధిస్తారు’



చార్మినార్: ఈసారి తమ పార్టీ అభ్యర్థులు భారీ మెజార్టీతో విజయం సాధిస్తారని బీజేపీ మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ అన్నారు. దారుషిఫాలోని తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ.. రెండు రోజుల క్రితం తాను మల్కాజిగిరి బీజేపీ అభ్యర్థి ఎన్.రాంచంద్రారావు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నానని.. ఆయా ప్రాంతాల్లో తమ పార్టీకి స్థానిక ఓటర్లు అడుగడుగునా స్వాగతం పలికారన్నారు.

యుగ తులసి పార్టీని గెలిపించండి



గోమాతకు పూజ చేస్తున్న అధ్యక్షుడు శివకుమార్

చాంద్రాయణగుట్ట: తెలంగాణలో గోవు గెలుపు...దేశానికే మలుపుగా మారుతుందని యుగ తులసి పార్టీ అధ్యక్షుడు కె.శివ కుమార్ అన్నారు. ఉప్పుగూడలో పార్టీ అభ్యర్థి ఆడాల కరుణతో కలసి పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ.. సకల దేవతా స్వరూపమైన గోవుని జాతీయ ప్రాణిగా ప్రకటించాలనే ఏకైక డిమాండ్‌తో ఎన్నికల బరిలోకి దిగామన్నారు. ఆవుతోనే ఆరోగ్యం, అభివృద్ధి, ఆనందం, ఆధ్యాత్మికం ఏర్పడుతాయన్నా రు. నియోజకవర్గం అభివృద్ధి కోసం యుగ తులసి పార్టీని గెలిపించాలని ఆయన కోరారు. సత్యనారాయణ, ఎం.శ్రీనివాస్, శ్రీశైలం, ఎం.రమేష్ కుమార్, యాదయ్య, కిశోర్ కుమార్, రవి పాల్గొన్నారు.

నాంపల్లిలో ఎంఐఎం జెండా ఎగరవేస్తాం



నాంపల్లి: నియోజకవర్గంలో ఎంఐఎం జెండా ఎగురవేస్తామని అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. సోమవారం ఉదయం వాంబే కాలనీలో పాదయాత్ర చేశారు. నాంపల్లి ఏఐఎంఐఎం అభ్యర్థి మాజిద్ హుస్సేన్‌ను గెలిపించాలని కోరుతూ ఆయన ఓటర్లను అభ్యర్థించారు. స్థానిక బస్తీ నేత కొమురయ్య నేతృత్వంలో స్థానికులు పలు సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. ఎన్నికలు పూర్తికాగానే సమస్యలన్నింటిని పరిష్కరిస్తానని, కొత్తగా పోటీ చేయబోతున్న మాజిద్ హుస్సేన్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. పోచయ్య, జులేఖాబీ, రేణుకా, యాదమ్మ, నర్సమ్మ, ఊర్మిళ, అంజమ్మ పాల్గొన్నారు.

యాకుత్‌పురా నుంచి ఎంబీటీని గెలిపించండి




చార్మినార్: యాకుత్‌పురా శాసనసభ నియోజకవర్గం నుంచి ఎంబీటీ అభ్యర్థిగా ఎన్నికల బరిలో ఉన్న తన తమ్ముడు అంజదుల్లాఖాన్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఎంబీటీ అధ్యక్షుడు ఫర్హతుల్లాఖాన్ స్థానిక ఓటర్లను కోరారు. అభ్యర్థి అంజదుల్లాఖాన్ నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొని ఎంబీటీకే ఓటు వేయాలని ఓటర్లను కోరారు. ప్రస్తుతం మజ్లిస్ పార్టీ నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థి జాఫర్ హుస్సేన్ మేరాజ్ స్థానికేతరుడన్నారు.

అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

బహదూర్‌పురా: మజ్లిస్ పార్టీ అభ్యర్థి మహ్మద్ మోబీన్ పలు డివిజన్ల కార్పొరేటర్లతో కలిసి సోమవారం ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. మజ్లిస్ పార్టీకి ఓటు వేసి తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.



కాళీ మాతను దర్శించుకున్న బీఆర్ఎస్ అభ్యర్థి



చాంద్రాయణగుట్ట: ఫలక్‌నుమా కాళిమాత ఆశీస్సులతో ఎన్నికల్లో విజయం సాధిస్తానని బీఆర్ఎస్ చాంద్రాయణగుట్ట అభ్యర్థి ముప్పిడి సీతారాంరెడ్డి అన్నారు. జంగమ్మెట్ డివిజన్‌లో సోమవారం ఆయన ఇంటింటికీ తిరుగుతూ కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆయన ఫలక్‌నుమా కాళి మాత అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ విజయవంతంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే తన విజయానికి దోహదపడుతాయన్నారు. స్వరూప రాణి, బాలరాజ్, గిరిధర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

దాడి కేసులో నలుగురి రిమాండ్

డబీర్‌పురా: ఓ వ్యక్తిపై దాడి చేసిన కేసులో నలుగురిని డబీర్‌పురా పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ కోటేశ్వర్ రావు తెలిపిన వివరాల ప్రకారం.. డబీర్‌పురాకు చెందిన ఏసీ మెకానిక్ మహ్మద్ హాజీ బాబా అలియాస్ సమీర్ ఈనెల 17న రాత్రి 11.30 గంటల సమయంలో మలక్‌పేట్ కాలాడేరా ప్రాంతంలో నివాసముండే సోదరుని ఇంటికి వెళుతున్నాడు. అదే సమయంలో అక్కడ ఉన్న మూసానగర్‌కు చెందిన మహ్మద్ ఫైజాన్ (19), కమల్‌నగర్‌కు చెందిన మహమ్మద్ అల్తాఫ్ (21), పోచమ్మ ఆలయ ప్రాంతానికి చెందిన మహ్మద్ సల్మాన్ (23), తలాబ్‌కట్టా అమన్‌నగర్-బీకి చెందిన మహ్మద్ మోహసీన్ (26)లు సమీర్‌పై దాడికి పాల్పడి తీవ్రంగా గాయపరిచారు. ఈ దాడి నుంచి తప్పించుకున్న సమీర్ 18న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మహ్మద్ ఫైజాన్, అల్తాఫ్, మహ్మద్ సల్మాన్, మోహసీన్‌ను అరెస్ట్ చేసి సోమవారం రిమాండ్‌కు తరలించారు.